క్లుప్తంగా

సౌత్‌జోన్ పోటీలకు 'ధనలక్ష్మి' విద్యార్థులు


ఎస్.హిమబిందు


ఎం.వంశీ

ఈపూరు (శావల్యాపురం): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం బీపీఈడీ విద్యార్థిని ఎస్.హిమబిందు నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 20న జరిగిన రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు చుండు వెంకటరావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. హిమబిందు తమిళనాడులోని సెంట్రల్ యూనివర్సిటీలో జరగనున్న సౌత్‌జోన్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అదేవిధంగా కళాశాలకు చెందిన ఎం.వంశీ ఈనెల 21, 22 తేదీల్లో గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో జరిగిన ఖోఖో పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి పంజాబ్ గురుకాశీ యూనివర్సిటీలో జరిగే పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు, అధ్యాపకులు ఆర్‌బీ నాయక్, అరవింద్, దాసు, వంశీలు ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి సీనియర్ మహిళా బేస్‌బాల్ టోర్నమెంట్‌కు వాసవి డిగ్రీ కళాశాల విద్యార్థిని పి.చైతన్య ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ బి.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. నెల్లూరుజిల్లాలోని కసుమూరు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సీనియర్ మహిళా బేస్‌బాల్ రాష్ట్రజట్టు ఎంపిక పోటీలో చైతన్య ప్రతిభ కనపరిచి జట్టులో స్థానం సాధించినట్టు వివరించారు. ఈనెల 26 నుంచి 30వతేది వరకు పంజాబ్‌లోని సంగ్రూర్‌లో జరగనున్న జాతీయస్థాయి మహిళా బేస్‌బాల్ టోర్నమెంట్‌లో చైతన్య ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. చైతన్యను కళాశాల డైరెక్టర్ వి.శ్యామ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

ఎన్‌ఈసీ ఆంగ్ల అధ్యాపకునికి డాక్టరేట్



నరసరావుపేట రూరల్: నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల(ఎన్‌ఈసీ)లో ఆంగ్ల విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న గుంటూరు రాధాకృష్ణమూర్తి పీహెచ్‌డీ పట్టా పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఎస్‌జీబీ అమరావతి యూనివర్సిటీలో డాక్టర్ నీలేష్ తారే పర్యవేక్షణలో క్రిటికల్ స్టడీ ఆఫ్ చిల్డ్రన్ ఇన్ ది సెలక్ట్ వర్క్ ఆఫ్ ఆర్‌కే నారాయణ్ అనే అంశంపై సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించినట్టు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో రాధాకృష్ణమూర్తిని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్, బీఎస్అండ్‌జీ విభాగాధిపతి డాక్టర్ కె.పాన్నాల లక్ష్మీలు అభినందనలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలకు ఆదేశాలు

శావల్యాపురం: మండలంలోని ముట్నూమల్లిలో నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి హామీ కులతో పనులు చేయించి వారికి కూలి ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా పీడీ సిద్ధిలింగమూర్తి తెలిపారు. ముట్నూమల్లి గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలతో తాగునీటి చెరువు వద్ద పనులు, మరో ప్రాంతంలో పనులు చేయించి కూలి ఇవ్వలేదని ఉపాధి హామీ కూలీలు సోమవారం కలెక్టర్ ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీఓ కె.రామారావుకు పీడీ ఆదేశాలు జారీ చేశారు.

దిగుబడులకు కత్తెర!

- మొక్కజొన్నలో కత్తెర, లద్దె పురుగుల బెడద
- జిల్లాలో 6వేల హెక్టార్లలో పంట సాగు
- పలు దశల్లో పంటకు నష్టం కలిగిస్తున్న కత్తెర పురుగు
- మొలక దశలో పంటను నాశనం చేస్తున్న లద్దె పురుగు
- పురుగు మందుల వినియోగంతో రైతులపై అదనపు భారం
- పురుగుల ఉధృతికి పంటను నాశనం చేసి రెండోసారి నాటుకుంటున్న కొందరు రైతులు


మొక్కజొన్న పంట

నరసరావుపేట రూరల్: మొక్కజొన్న రైతులకు పురుగుల ఉధృతి కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. లద్దె పురుగు, కత్తెర పురుగుల నివారణకు రైతులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. పంట మొలక దశలోనే లద్దె పురుగు పంటకు తీవ్ర నష్టం కలిగిస్తుంటే, కత్తెర పురుగు మొక్కల ఎదుగుదల నుంచి కండే దశ వరకు వివిధ దశలలో పంటకు హాని కలిగిస్తుంది. పురుగుల నివారణ కోసం రైతులు పురుగుమందులపై ఆధారపడుతున్నా ప్రయోజనం లేకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది.

రబీలో మొక్కజొన్న సాగుకు మొగ్గు

జిల్లాలో ఈ ఏడాది మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. రబీలో మొక్కజొన్న సాగును పెద్ద ఎత్తున చేపట్టారు. ఇప్పటికే జిల్లాలో 6వేల హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. నాగార్జునసాగర్‌లో నీటి నిల్వలు పుష్కలంగా ఉండటంతో ఆరుతడులకు ఇబ్బందులు ఉండవనే భావనతో రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపిస్తున్నారు. పత్తి సాగు చేసిన రైతులు పంట పూర్తవడంతో పొలాలను శుభ్రపరిచి మొక్కజొన్న విత్తేందుకు సిద్ధం చేస్తున్నారు. దీంతో పంట సాగు విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉంది.

మొలక దశలోనే పంటకు నష్టం

మొలక దశలోనే మొక్కజొన్న పంటకు లద్దె పురుగులు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. మట్టిలో ఉండే ఈ పురుగు విత్తనాలు విత్తిన పదిరోజుల తరువాత వచ్చే మొలకలకు ఆశించి పంటను నాశనం చేస్తున్నాయి. మొలక భూమి పొరలు దాటిన మరుసటి రోజు నుంచే దాడిచేస్తుంది. పడి మొక్కలు వేసుకున్నా పురుగు తిరిగి తన ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. దీంతో రైతుల్లో ఈ పురుగు పట్ల ఆందోళన నెలకొంది. లద్దె పురుగు ఆశించి పంట నష్టం కలిగిన పలువురు రైతులు పంటను పూర్తిగా దున్ని తిరిగి విత్తనాలు విత్తుతున్నారు.

నరసరావుపేట మండలం దొండపాడులో సుమారు 50 ఎకరాల్లో ఈ విధంగా రెండవ సారి విత్తనాలు విత్తాల్సి వచ్చింది. దీని వలన ఎకరానికి సుమారు రూ.10వేలు వరకు రైతులకు అదనపు భారం పడింది.

కత్తెర పురుగు ఉధృతి


కత్తెర పురుగు

మొక్కజొన్న రైతులను కత్తెర పురుగు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. లేత పంట నుంచి ముదురు పంటవరకు ఈ పురుగు ఆశించి తీవ్రంగా నష్టాన్ని చేకూర్చుతుంది. మొదటి దశ గొంగళి పురుగు ఆకులపై పత్ర హరితాన్ని గోకి తింటూ ఆకులపై రంధ్రాలను చేస్తొంది. ఈ పురుగు పెరిగే కొద్దీ ఆకుల చివరల నుంచి తింటూ ఆకులను కత్తిరించినట్టుగా కనిపిస్తుంది. ఆకు సుడులను, కాండానికి కూడా రంధ్రాలను చేసి పంటను నష్టపరుస్తుంది. మొక్కజొన్న కంకిలోకి కూడా ఈ పురుగు చేరి లేతకండే భాగాన్ని తింటుంది. చలి వాతావరణం కారణంగా పురుగు ఉధృతి ఎక్కువగా కనిపిస్తుంది. వీటి నివారణకు రైతులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. రసాయన పురుగుమందులు ఎక్కువగా ఉపయోగిస్తుండటంతో అదనపు భారంగా మారింది.

రెండో సారి నాటుకున్నాం..



లద్దె పురుగు కారణంగా మొలక దశలోనే పంట ఎదుగుదల నిలిచిపోయింది. పడి మొక్కలు వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పంటను నాశనం చేసి రెండవ సారి విత్తనాలు వేసాము. దీని వలన ఎకరానికి రూ.10వేలు అదనపు భారం పడింది.

– జిక్కిరెడ్డి వెంగళరెడ్డి, దొండపాడు, నరసరావుపేట మండలం

పురుగులను నియంత్రించలేకపోతున్నాం...



నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నా. పురుగు నివారణకు వారంలో రెండు సార్లు పురుగుమందులు పిచికారీ చేస్తున్నాను. అయినా నివారణ సాధ్యపడటం లేదు. చలివాతావరణం ఉండటంతో పురుగు ఉధృతి తీవ్రంగా ఉంది.

– బోయపాటి శంకర్, ములకలూరు, నరసరావుపేట మండలం

నివారణ చర్యలు పాటించాలి...

మొక్కజొన్న వేసిన రైతులు విత్తనాలు విత్తిన వెంటనే లద్దె పురుగు నివారణ చర్యలు చేపట్టాలి. 10కేజీల తవుడు, రెండు కేజీల బెల్లంను లీటరు మోనోక్రాన్‌తో కలిపి విషపు యరగా తయారు చేసుకోని పొలంలో చల్లుకోవాలి. అలాగే తొలిదశలోనే కత్తెర పురుగు నివారణ చర్యలను తీసుకోవాలి.

– పి.మస్తానమ్మ, ఏడీఏ, నరసరావుపేట

నష్టపోయిన పంటపొలాల పరిశీలన


కొండ్రముట్లలో దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఈపూరు(శావల్యాపురం): అకాల వర్షం వలన పంట నష్టం వాటిల్లిన రైతులకు ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఏడీఏ బోయపాటి రవిబాబు తెలిపారు. మండలంలోని కొచ్చర్ల, కొండ్రముట్ల గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా రవిబాబు మాట్లాడుతూ వరి పంట పొలాల్లో నిల్వ ఉన్న నీటిని తక్షణమే బయటకు పంపాలని ఓదెలను గట్లపైకి చేర్చి రంగు మారకుండా 2 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని రైతులకు సూచనలు చేశారు. పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటానికి రైతులు జాగ్రత్తలు పాటించి వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు పాటించటం ద్వారా పంట పొలాలు నష్టాన్ని కొంత మేర తగ్గించవచ్చునన్నారు. ప్రాథమికంగా వరి, మొక్కజొన్న, పొగాకు పంటలకు 928 ఎకరాల్లో నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్ట నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. రైతుసేవా కేంద్రం వీఏఏల సారథ్యంలో రెండు రోజుల వ్యవధిలో క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంట పొలాలను పునఃపరిశీలించి తదుపరి రైతులకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు బొల్లాపల్లి మండల వ్యవసాయ అధికారి అబ్బూరి రామారావు, రైతులు ఉన్నారు.

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో అకాల వర్షం వలన దెబ్బతిన్న మొక్కజొన్న, పొగాకు పంట పొలాలను సోమవారం వ్యవసాయ అధికారులు పరిశీలించారు. ఏడీఏ బోయపాటి రవిబాబు మాట్లాడుతూ గ్రామంలో మొక్కజొన్న–20 ఎకరాలు, పొగాకు–20 ఎకరాలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు నిర్ధారించారన్నారు. ఆయనతో పాటు ఏఈవో పూరేటి అశోక, వీఏఏ డి.స్రవంతి రైతులు ఉన్నారు.

నరగాయపాలెంలో..

వినుకొండ(నూజెండ్ల): తుపాను, అధిక వర్షాల కారణంగా వరి పంటలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ కె.అంజిరెడ్డి తెలిపారు. మండలంలోని నరగాయపాలెంలో వానకు దెబ్బతిన్న వరి పంటను ఆయన పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. ఆయనవెంట వ్యవసాయ సిబ్బంది, రైతులు ఉన్నారు.

రెండు గ్రామాల్లో..

బొల్లాపల్లి : అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని వినుకొండ ఏడీఏ బి.రవిబాబు అన్నారు. వర్షానికి నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. మండలంలోని వెల్లటూరు, కనుమలచెరువు గ్రామాల పరిధిలోని వరి పొలాలను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరి కోతల సమయంలో కురిసిన అకాల వర్షానికి నేలకొరిగిన పంటలను కాపాడుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఏఓ ఎ.అంకారావు, సిబ్బంది ఉన్నారు.

బైపాస్ రోడ్డు పనులను అడ్డుకున్న రైతులు

నరసరావుపేట రూరల్: చీరాల ఓడరేవు– పిడుగురాళ్ళ జాతీయ రహదారి పనుల్లో భాగంగా చేపట్టిన బైపాస్ రోడ్డు పనులను రైతులు సోమవారం అడ్డుకున్నారు. కేసానుపల్లి, జొన్నలగడ్డ, ఇస్సప్పాలెం, రావిపాడు గ్రామాల నుంచి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం కేటాయించిన భూముల్లో కొలతలు తీసే పనిని అధికారులు చేపట్టారు. ఈ పనులను ఆయా గ్రామాల్లోని బాధిత రైతులు అడ్డుకున్నారు. రావిపాడు వద్ద నకరికల్లు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. బైపాస్ రోడ్డు ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జనవరి నెల నుంచి భూముల ధరలను పెంచుతున్న నేపథ్యంలో దాని విలువ ఆధారంగా పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పొలాల్లో పంటలు ఉన్నాయని రెండు నెలలు సమయం ఇస్తే పంటలు తమ చేతికి వస్తాయని అప్పటి వరకు సర్వే పనులు నిలిపివేయాలని తెలిపారు. తహసీల్దార్ వేణుగోపాలరావు ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. రైతుల డిమాండ్లను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన అవసరం

చిలకలూరిపేట: డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యూనియన్ బ్యాంక్ పండరీపురం బ్రాంచ్ మేనేజర్ రోహిత్‌సిన్హా చెప్పారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో ఖాతాదారులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్‌లో ఉండాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని తెలిపారు. బ్యాంకులు ఎలాంటి ఓటీపీలు ఖాతాదారుల నుంచి అడగవని ఈ విషయాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంక్ సంబంధిత ఫిర్యాదులు, లావాదేవీలపై అవగాహన కల్పించారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టల్ వెంకటస్వామి, విశ్రాంత డీఈఓ జాషువా, విశ్రాంత ఎంఈఓ కందిమళ్ల మురళీధరరావు, రీసోర్సు పర్సన్లు బాబూరావు, నర్సింహనాయక్, రవిరాజు, పృథ్వీరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ సమీపంలోని పసుపులేరు బ్రిడ్జి వద్ద ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో గురవయ్య అనే వ్యక్తి మృతి చెందగా భీమరాజు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శోభన్‌బాబు తెలిపారు.

ఉద్రిక్తత...

వినుకొండ పట్టణంలోని శివయ్యస్థూపం సెంటర్‌లో ఉద్రిక్తత నెలకొంది. గత రాత్రి వినుకొండ సమీపంలోని పసుపులేరు వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఇందులో భాగంగా మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు తమకు న్యాయం జరగలేదని శివయ్యస్థూపం సెంటర్‌లో ఆందోళనకు దిగారు.

ఇందులో భాగంగా బాధితులకు సంబంధించిన ఒక వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో అప్రమత్తమైన పోలీసులు సదరు వ్యక్తిని కాపాడి అదుపులోకి తీసుకున్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ గణిత మేధావి భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ చైర్మన్ సంద్రపాటి చలపతిరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పజిల్స్, వకృత్వం పోటీలను జూనియర్, సీనియర్ స్థాయిలో నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహమ్మద్ సుభాని, ఎస్‌పీఆర్ పరమేశ్వరరావు, వ్యాయమా ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్, పి.రఘునాథ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీరామా పబ్లిక్ స్కూల్‌లో...

శావల్యాపురం: శ్రీరామా పబ్లిక్ స్కూల్లో గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గోళ్లపూడి రత్నకుమారి తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ–2 పుసులూరి లలిత కుమారి పాల్గొని మాట్లాడుతూ రేఖా గణితంలో విద్యార్థులు వివిధ గణిత ఆకృతులు తయారు చేసి మొక్కల చుట్టూ అమర్చిన విధానాన్ని ఎంఈఓ ప్రత్యేకంగా అభినందించారు. గణిత ప్రతిభా పరీక్షల్లో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించి మెమొంటోలను అందజేశారు. కరస్పాండెంట్ కనగాల వెంకట రామమోహన్ చందు, డైరెక్టరు అజిత్‌చందు, ఉపాధ్యాయుడు కె.శ్రీనివాససింగ్ పాల్గొన్నారు.

'వర్సిటీ' ఖోఖో విజేత విక్టరీ కళాశాల


వర్సిటీ పురుషుల ఖోఖో విజేతగా నిలిచిన జట్టుతో కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల ఖోఖో టోర్నమెంట్‌లో విక్టరీ కళాశాల జట్టు ప్రథమస్థానం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్, పీడీ ఎస్.కృష్ణంరాజు సోమవారం తెలిపారు. గుంటూరు టీజేపీఎస్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 21, 22 తేదీలలో నిర్వహించిన టోర్నమెంట్‌లో తమ జట్టు రెండవసారి ఖోఖో కప్పును కైవశం చేసుకుందని వివరించారు. అలాగే వర్సిటీ జట్టుకు తమ విద్యార్థులు పి.సైదారావు, డి.రమణారెడ్డి, ఎం.అవినాష్, కె.రామకృష్ణ, బి.ప్రదీప్‌కు ఎంపికయ్యారని తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఒద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

వర్సిటీ జట్టుకు కృష్ణవేణి విద్యార్థుల ఎంపిక..

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల ఖోఖో పోటీల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు తృతీయ స్థానం సాధించటంతో పాటు ఇద్దరు విద్యార్థులు వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు సోమవారం తెలిపారు. తమ విద్యార్థులు పి.గోపీనాథ్, షేక్.అల్లాభక్షులు ఈనెల 28 నుంచి 30వతేది వరకు తమిళనాడులోని కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరగనున్న దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల ఖోఖో పోటీలో ఏఎన్‌యు జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ నాతాని, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



శావల్యాపురం: స్థానిక గ్రామ సచివాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రపంచ మానవళికి ప్రేమ, దయ కరుణ శాంతి మార్గంలో ఉండాలని బోధించారన్నారు. అనంతరం కిస్మస్ కేక్‌ను కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈఓపీఆర్డీ పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి బి.యాకోబు, ఏపీఓ కె.రామారావు, ఏపీఎం జి.వాసుబాబు, ఎంపీడీఓ కార్యాలయం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

చిలకలూరిపేట: ఆదాయపు పన్నుశాఖ ఆధ్వర్యంలో పన్ను చెల్లింపు దారులకు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహిస్తున్నట్లు ట్యాక్స్‌బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. పట్టణంలో శ్రీనివాసం ఫంక్షన్ హాలులో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆదాయపు పన్నుశాఖ ఉన్నతాధికారులు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 130 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైకి చెందిన సదర్‌ల్యాండ్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 130 మంది విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. కళాశాలలో సోమవారం కంపెనీ ప్రతినిధులు బృందచర్చలు, వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు నిర్వహించినట్టు తెలిపారు. ఎంపికైన వారిలో సీఎస్‌ఈ–64, ఏటీఎంఎల్–11, ఈసీఈ–38, ఐటీ–26, ఈఈఈ బ్రాంచ్ నుంచి ఒకరు ఉద్యోగానికి ఎంపికయ్యారని వివరించారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, కార్యదర్శి రావెల సత్యనారాయణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.సాంబశివరావు, అధ్యాపకులు అభినందించారు.

రాగితీగ చోరీపై కేసు నమోదు

నాదెండ్ల: నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన రాగితీగ చోరీకి గురైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన కల్లూరి నాగరాజు సోలార్ సిస్టం కాంట్రాక్టర్‌గా పనిచేస్తుంటాడు. నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్లను బిగించేందుకు జాతీయ రహదారి వద్ద ఉంచాడు.

ఈ నెల 16న ట్రాన్స్‌ఫార్మర్లలోని విలువైన కాపర్‌వైరును దొంగిలించారు. దీనిపై నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త వార్తలు

■ ఉత్తమ గణిత బోధకురాలిగా దేవవరం ఉపాధ్యాయురాలు



నరసరావుపేట: ఏపీ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత దినోత్సవాల్లో నకరికల్లు మండలం దేచవరం ఏపీ మోడల్ స్కూలు పీజీటీ గణిత ఉపాధ్యాయిని పంగులూరి అంజనీ కుమారి రెండు ఉత్తమ బహుమతులు గెల్చుకున్నారు. ఇన్నోవేటివ్ ఐడియాస్ ఇన్ టీచింగ్ మ్యాథమేటిక్స్ అనే పేపర్ ప్రజెంటేషన్ పోటీలలో టీఎల్ఎం గణిత బోధకురాలైన అంజనికుమారి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. దీనికి డిప్యూటీ డైరెక్టర్ ఎస్.అబ్రహాం ముఖ్యఅతిథిగా హాజరై ఉపాధ్యాయురాలికి బహుమతులు అందజేశారు.

■ అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన

రొంపిచర్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా స్థానిక చెరువు కట్ట సెంటర్లో ప్రజా ఐక్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ వాదాన్ని రూపుమాపి మనువాదం అమలుకు తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ బి.నిర్మలకు వినతిపత్రం అందజేశారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కామినేని రామారావు, మాజీ సర్పంచ్ తిప్పగుడిశ జయమ్మ పాల్గొన్నారు.

■ పేదలకు దుప్పట్ల పంపిణీ



నాదెండ్ల: పేదలు, వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవటమే ఏసు క్రీస్తు ఇచ్చిన సందేశమని మహాకవి గుర్రం జాషువా సిద్ధాంత భూమిక అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు దారా కొండయ్య చెప్పారు. గణపవరం అంబేడ్కర్‌నగర్‌లోని షిలోహు క్రిస్టియన్ అసెంబ్లీలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. దాత కొప్పుల ఓబయ్య అందించిన ఆర్థికసాయంతో వంద మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు. పాస్టర్ జి.శ్రీనివాసరావు, పెద్దలు పాల్గొన్నారు.

■ మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: భారతదేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించి అభివృద్ధి సంస్కరణలను పరుగులు పెట్టించిన ఘనత భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుకు దక్కుతుందని పలువురు పేర్కొన్నారు. బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం మాజీ ప్రధాని పీవీ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. సంఘం కార్యలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ సేవాసంఘం ప్రతినిధులు ముత్తనపల్లి శివకృష్ణప్రసాదు, కె.వి.పురుషోత్తమరావు, కోట సాంబశివరావు, బొగ్గరం ఫణిరాజకుమార్, మద్దాలి రాంబాబు తదితరులు పాల్గొని పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశాభివృద్ధికి పీవీ చేసిన కృషిని కొనియాడారు.

■ విద్యాసామగ్రి పంపిణీ

నాదెండ్ల: బుక్కాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం కనపర్రు హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ఏడాదికి సరిపడా నోటు పుస్తకాలు, పెన్నులు, చార్ట్‌లు, విద్యాసామగ్రిని కంపెనీ ఎండీ ఏజే ప్రసాద్, మేనేజర్ విజయలక్ష్మీ చేతుల మీదుగా అందజేశారు.

■ జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంఏఎం విద్యార్థి ఎంపిక

నరసరావుపేట రూరల్: జాతీయస్థాయి బేస్‌బాల్ సీనియర్ చాంపియన్ షిప్ టోర్నమెంట్‌కు ఎంఏఎం పీజీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ ఎం.రామశేషగిరిరావు సోమవారం తెలిపారు. ఈనెల 20వ తేదీన వెంకటాచలం మండలం కసుమూరు జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో కళాశాల విద్యార్థి బి.సాగర్ పాల్గొని ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు.